




# జాతి రత్నం

## పోల పిచ్చయ్య / హైదరాబాద్

కష్టాలు - కన్నీళ్ళు, ఆకలి - ఆరాటాలు, రేయనకా పగలనకా తీరని వేదనలు, రెక్కలు ముక్కలు చేసుకున్నా గుక్కెడు గంజినీళ్ళ కోసం కటకట. ఇదే లక్షలాది కుంచెరుకుల దీన గాథ. ఇటువంటి నిర్భాగ్యుల జీవితాల్లో పెనుమార్పు తెచ్చిన ఓ సామాన్యుడి కథనం ఇది. అతడి విజ్ఞానం జాతికి మేలుకొలుపు.



**అతడు ప్రభుత్వ అధికారి కాదు,** స్వచ్ఛంద సంస్థ కార్యకర్తా కాదు. ఓ మామూలు గిరిజనుడు. పేరు పోల పిచ్చయ్య. ఆంధ్రప్రదేశ్‌లోని ఇరవై లక్షలమంది కుంచెరుకుల్లో ఇతడొకడు. చీపురు కట్టల తయారీయే ఇతడి ప్రధాన జీవనాధారం.

చీపుర్ల తయారీకోసం అవసరమయ్యే ఈత బరుగును సేకరించుకోవడం, ఆ బరుగును సన్నగా కోయడం, ఈతముండ్లు తొలిగిపోయేదాకా చెక్క పలకతో నున్నగా రుద్దడం, ఆ తర్వాత చీపుర్ల తయారీలో నిమగ్నం కావడం - ఇదీ ఇతడి దినచర్యగా ఉండేది. ఇదంతా కాయకష్టంతో కూడిన పని. దినమంతా పనిచేసినా పది చీపుర్లను మించి అధిక సంఖ్యలో తయారు చేయలేరు. ఒంటి నొప్పులు భరించడం అదనంగా ఉండేది. ఇవన్నీ పిచ్చయ్యను ఆలోచింపజేశాయి. దాంతో అతడు ఓ చిన్న మోటరును తయారు చేసి ఎరుకల కుటుంబాల్లోకి దాన్ని ప్రవేశపెట్టాడు. ఫలితంగా ఓ పెను విప్లవానికే ఆయన నాంది పలికాడు.

చీపుర్ల తయారీని సులభతరం చేయడానికి పిచ్చయ్య తొలిదశలో ఓ చెక్క సాధనాన్ని తయారు చేశాడు. రెండో దశలో ఒక రైతునుంచీ విద్యుత్తు మోటరు తెచ్చి, దాన్ని గ్రైండింగ్ మిషనుగా మార్చివేశాడు. ఇది విజయవంతం అయ్యాక ఆ చెక్కసాధనాన్ని తీసేసి

బరువు తక్కువగా ఉండే ప్లాస్టిక్ పాత్రను బిగించి చూశాడు. ఫలితంగా ఆ యంత్రం మరింత సౌకర్యంగా తయారైంది. ఇంకేం? ఇంటింటికీ తిరిగి ఆ మోటరును తమ తెగవారందరికీ పరిచయం చేశాడు. అలా ఒకే ఒక్క మనిషి వివేచన చీపుర్ల తయారీలో ఓ అపూర్వదృశ్యాన్ని ఆవిష్కరింప జేసింది.

**ఇది నిన్నా ఇవ్వాల్టి విశేషం కాదు, రమారమి పద్దెనిమిది సంవత్సరాల క్రితం సంగతి. కానీ ఈ విశేషాన్ని ఏ పత్రికా ప్రచురించలేదు. మరే టెలివిజన్ ఛానలూ ఆయన్ని పలకరించలేదు. మన జనమాధ్యమాల ఘనత అంతటిదంటే సిగ్గు సిగ్గు.**

అయినా ఈ ప్రచార, ప్రసార సాధనాలతో తనకేమీ నిమిత్తం అన్నట్టుగానే ఉంటాడు పిచ్చయ్య. ఆయన నిరాడంబరంగా, నిమ్మళంగా పనిచేసుకుంటూ ఉంటాడు. తన జాతి జనులకు మేలు చేయడంలో తనకు సంతృప్తి. అంతే తప్పా ప్రపంచానికి తన గురించి తెలియవలిసింది ఉందని కూడా ఆయన అనుకోడు.



ఇదే పిచ్చయ్య ఆవిష్కరించిన చీపురు యంత్రం

కానీ చెప్పవలసింది చెప్పక తప్పదు. పిచ్చయ్య నిరక్షరాస్యుడే కావచ్చు. కానీ అతడి మేధస్సు కుంచెరుకల దైనందిన అవసరాలు తీర్చడంలో శాస్త్రవేత్తలకు మిన్నగా వికసించింది. నేడు రాష్ట్రంలోని ప్రతి కుంచెరుకల కుటుంబంలో ఆయన రూపొందించిన మోటరు ఓ తప్పనిసరి అవసరంగా ఉంది. ఒక రకంగా అది వారి జీవన యంత్రం అన్నా అతిశయోక్తికాదు.

కుంచెరుకుల కష్టాలను సగానికి సగం తగ్గించి వేసిన ఆ మోటరు గూర్చి, వారి ఆర్థిక పరిస్థితిని కొన్ని రెట్లు పెంచివేయడంలో అది నిర్వహించిన పాత్రను ఎవరైనా పరిశోధన చేస్తే, విశ్వవిద్యాలయాలతో నిమిత్తం లేకుండా మన గ్రామసీమల్లో నిశ్శబ్దంగా ఎదుగుతున్న శాస్త్ర విజ్ఞానం ఏ పాటిదో తెలిసి వస్తుంది. ఈ మాటే అంటే పోల పిచ్చయ్య ఏమంటున్నాడు? నవ్వి ఊరుకున్నాడు. "నీ ఇంటర్వ్యూ కావాలన్నా" అంటే, "ఎందుకయ్యా.. ? " అన్నాడు.

హైదరాబాదులోని ఎల్‌బి నగర్ సమీపంలో నాంచారమ్మకాలనీ ఉంటుంది. అందులో 150 ఎరుకల కుటుంబాలున్నాయి. ఆ కుటుంబాల్లో ఒక కుటుంబీకుడిగా, అర్ధనగ్నంగా, తాను సృజించిన మోటరుపై ఈతబరుగును మెత్తగా పాలిష్ చేస్తూ ఆయన ముచ్చట చెప్పినట్టు తన గురించి, తన ఆవిష్కరణల గురించి వివరించాడు.

ప్రశ్న - జవాబు అన్న రీతిలో కాకుండా ఆయన చెప్పిన సంగతులను ఆయన మాటల్లోనే నివేదించడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని, ఇలా ప్రారంభిస్తున్నాం....



పోల పిచ్చయ్య (46)

**"నేను సూర్యాపేటలో బతికేదండీ.** మా అమ్మ జీవనార్థం సోది చెబితే మా నాయిన పందులు కాసుకుని బతికేది. అడవి మీద కొంచెం షికారు చేసుకుని ఇన్ని పిట్టలో గిట్టలో పట్టుకునేది. అట్ల బతుకుతూ ఉంటే పందులు గిందులను గవర్నమెంటు తీసేయమన్నది. ఆడ్నుంచి మొత్తం తీసేసినాం. తీసేసాక ఎట్లా బతకాలె అని ఇట్లనే పొరక, కమ్మ తీసుకుని చీపుర్లు కట్టుకుని పొట్ట వెళ్ళదీసుకుని బతుకుతున్నం."

"బతుకుతుంటే ఈ కమ్మ రోజుకు పది ఇరవై తయారు చేయాలంటే ఈ ముండ్లు చేతులకు గుచ్చుకోవడం, ఇరవై ముప్పై చేస్తేనే



పూర్వం బరుగును మెత్తగా చేసేందుకు ఉపయోగించిన చెక్క పలక



1 హెచ్‌పి మోటరుతో నడిచే విద్యుత్తు యంత్రం



యంత్రంపై పాలిష్ అవుతున్న ఈత బరుగు



అమ్మకానికి సిద్ధమైన జాడీకట్టలతో బాలుడు

ఆడికే కష్టం అయిపోయేది. ఇది ముందుకు పోయేటట్టుగ ఎట్లా తయారు చేసుకోవాలా అని మా వృత్తి మేమే ఆలోచించుకోవాలని నేనే ఆలోచించిన."

"ఆలోచించి దీన్ని ఫస్టు ముండ్లన్ని తీసేసి ఒక్క పదిజేసే బదులు వంద తయారుగావాల. వంద తయారు గావాలంటే ఎట్ల జేస్కోవాలె అని ఆలోచించిన. ఒక చెక్క తయారు జేసిన... చెక్కను తయారు చేసి... ఆ చెక్కని బాడిష ఉలితోని తొలిగట్టుకుని... ఈ ముండ్లు... సికిల పుల్లల ముండ్లు చక్కగా తెగ్గొట్టి... ఆ చెక్కకు సక్కగ కొట్టుకుని... ఆడ్నుంచి ఈ మిషన..."

"ఈ మిషన... చిన్నగ ఒక రైతుని అడిగి ఫస్టు ఇంత చెక్కని రంపంతోని కోసుకుని దాన్ని తొలగొట్టి దానికి సైకిల పుల్లల దించేసి... దాన్ని ఒక మిషన మీద పెడితే ఇట్ల తయారైతదని మేము.. అంటే నేను తయారు చేసిన."

"చెక్కను తయారు చేసి... ముండ్లు దిగ్గొట్టి... ఇది మా మర్త్యాల (కర్నూలు జిల్లా) పోయి లారీల ఈ పరక కోసుకొచ్చి... దీనిమీదనే పాలిష్ చేస్తున్నం. పాలిష్ చేసి ఒక్క రోజుకి వంద రెండొందలు మూడొందలు తయారు చేసి అప్పోసొప్పో చేసి లారి కిరాయిబెట్టుకుని మహారాష్ట్ర తీస్కపోయి అమ్ముకొస్తున్నం. ఇగ దీనిమీదనే జీవనార్థం ఎల్లిపోతున్నది."

"దీంతోని కొన్ని వందలాది మంది జీవనారధం వెళ్ళిపోతున్నది. కర్నూలుగానీ నిజామాబాద్ గానీ బాన్సువాడగానీ ఆర్మూర్‌గానీ కాకినాడగానీ రాజమండ్రిగానీ చింతలపూడి గానీ ఖమ్మం గానీ సత్తుపల్లిగానీ సూర్యాపేటగానీ హైదరాబాద్‌గానీ ఈ మొత్తం జనాభా జీవనార్థం దీనిమీదనే ఎల్లిపోతున్నది."

"ఫస్ట్ ముప్పై ఇరవై తయారు చేసుకుంటే జీవనార్థం వెళ్ళేదిగాదు. ఈ మిషను తయారు చేసిన కాడ్నుంచీ కొన్ని వందలాది మందిమి రోజుకి వంద నూటాయాభై తయారు చేసుకుంటున్నం. అమ్ముకుని మంచిగనే రోజుకు రెండొందలు, మూడొందలు ఇట్ల తెచ్చుకుంటున్నం. సంవత్సరానికి రెండు సార్లు మహారాష్ట్ర తీసుకుపోతున్నం. తీసుకుపోయినప్పుడల్లా ఇరవై వేలు ముప్పై వేలు తెచ్చుకుంటున్నం."

"ఈ పరక కోస్కరావడానికి అప్పులు తెస్తంగద. అవి తీర్చంగ పది ఇరవై వేలు మిగులతయిగద. అట్లా మా జీవనార్థం మేం ఎల్ల దీస్కుంటున్నం. ఇప్పటివరకైతే మా జీవనార్థం చక్కగ ఎళ్ళిపోతున్నది."

అల్లుడా... అల్లుడా... మరి రోజుకు ఇరవై అయితున్నయి. మరి రోజుకు వంద వచ్చేటట్టుగ దీన్ని తయారుజేస్తే రోజుకు ముప్పై రూపాయలు వచ్చేది రోజుకు రెండొందలు వస్తాయి గద... మరి రెండొందల మీద మనకు జీవనార్థం చక్కగ వెళ్ళిపోతది... గద...అన్నడు మా మేనమామ. ఆడ్నుంచీ ఆలోచించిన..."

మిషన్‌ను పిచ్చయ్య 'మిషన' అనే అంటాడు. దాన్ని తయారు చేయాలనే ఆలోచన ఎట్లా వచ్చిందో చెబుతాడు:

"ఫస్టు చెక్కపలకతో దీన్ని రుద్దేవాళ్ళం. దీన్ని ఇట్లా చక్కగ ముందేసుకుని ఇట్లా రుద్దుకుంటే... రోజుకు పది ఇరవై చేస్తం. రెక్కలు ముక్కలు పడిపోతున్నయి. ఇట్లా రెక్కలు పడిపోతుంటే మా మేనమామ ఉండి దీన్ని తయారు చేయమని... అల్లుడా... అల్లుడా... మరి రోజుకు ఇరవై అయితున్నయి. మరి రోజుకు వంద వచ్చేటట్టుగ దీన్ని తయారుజేస్తే రోజుకు ముప్పై రూపాయలు వచ్చేది రోజుకు రెండొందలు వస్తాయి గద... మరి రెండొందల మీద మనకు జీవనార్థం చక్కగ వెళ్ళిపోతది... కొన్ని లక్షలమంది బతుకుతరు కద... అని చెప్పిండు. మా మేనమామ చెప్పిన కాడ్నుంచీ ఆలోచించిన.. ఆలోచించి దీని పాలిష్ చేసి రోజుకు రెండొందలు అయ్యేటట్టు తయారు చేస్తే వస్తదా... లేకపోతే ఎట్లా రుద్దితే ఇది వస్తది. ఇక మిషనల పెడితే నలిగిపోతది. ఏదన్న కట్టె తీస్కొని కొడ్తెనా ఇరిగిపోతది అని జెప్పి ఆలోచనతోని ఆలోచనజేసిన. దాన్ని ఈ చెక్కను... ఇట్ల చేస్తే వస్తదని నా బుర్రలోనే నేనే ఆలోచించుకుని... ఒక చెక్కను చక్కగ తయారు చేసిన. చేసి ఇగదానికి ముండ్లు కొట్టేసి... ఇగ కమ్మకోసి దానిమీద పట్టేసరికి చక్కగ పాలిష్ వచ్చింది.

**ఒక గుండ్రటి చెక్క లేదా మొద్దును తీసుకుని లోపలంతా తొలిచి, దాన్నే పిచ్చయ్య తొలగొట్టి అంటాడు. దానికి సైకిల(ల్) పుల్లల్ని మొలలుగా కొట్టి, తయారైన దాని 1 హెచ్‌పి మోటరు అనుసంధానిస్తాడు. విద్యుత్తు సహాయంతో దాన్ని నడుపుతాడు. అది గిర్రున తిరుగుతుంటే ఒకచేత్తో దానిపై ఈత బరుగును పెట్టి మరో చేత్తో చీపురుతో ఒత్తిపడితే ఆ బరుగు చిన్న శబ్దం చేస్తూ చీలిపోయి మెత్తగా ముండ్లులేకుండా అవుతుంది. దీన్నే పిచ్చయ్య 'పాలిష్ చేయడం' అంటున్నాడు.**


చెక్క పలకతో ఈత బరుగును పాలిష్ చేస్తున్న వృద్ధురాలు

"ఫస్ట్ ఇలా తయారు చేసినం. సక్సెస్ అయింది. దీనికన్న పని అల్కక ఉండాలని జెప్పి పాత ఇనుప సామాన్ల షాపుల పెద్ద పెద్ద పైపులు వస్తయి. విజయవాడలో ఆ ప్లాస్టిక్ పైపులకి చక్కటి మూతలు కనిపించినయి. వాటిని ఇనుప సామన్లలో వట్టిగనే పారేసేటోళ్ళు. అవి సూస్తె చెక్కతో పాటు ఇవి గట్టిగున్నయి. అల్కగున్నయని జెప్పి ఆ చెక్కను పక్కన బెట్టి మూతను తలిగిచ్చినం. ఆహా... ఇది గూడ సక్సెస్ అయింది. ఇగ ఇప్పుడు దాదాపు పదిహేను, పద్దెనిమిది సంవత్సరాలైంది. మిషన తయారైంది. ఇది తయారైన కాన్నుంచీ దీనిమీదనే జీవనార్థం వెళ్ళిపోతున్నది."

**ఫలితంగా బట్టకి పొట్టకి లొట్టకి ఏ ఇబ్బంది లేకుండా జీవనం గడిచిపోతున్నదట.**

"ఫస్టు చెక్కకు ముండ్లుకట్టుకుని రుద్దితే రోజుకు ఇరవై ముప్పై తయారు చేసుకుంటే పెద్ద కష్టమయ్యేది. గూడలు నొయ్యంగ, నడుములు వొంగంగ అయ్యేదిగాదు. ఇది చేసినంక ఇటు రాజమండ్రి కాడ్నుంచీ సామర్లకోటదాకా.. రాజమండ్రి, చింతలపూడి, కర్నూలు, నిడదవోలు, సూర్యాపేట, సత్తుపల్లి, మిర్యాలగూడ, హైదరాబాద్ దాకా. అటు కర్నూలు జిల్లా మొదలు నిజాంబాద్, బాన్సువాడ, ఆర్మూర్, కామారెడ్డి అంతటా ఇదే మనిషి మొత్తం దీనిమీదే జీవనార్థం. మనిషి కుటుంబానికి మూడొందలు నాలుగొందలు ఐదొందలు ఇట్ల సంపాదిస్తున్నాం. పొట్టకి బట్టకి లోటు లేకుండా నడిపోతున్నది."

**'నెస్సిసిటీ ఈజ్ మదర్ ఆఫ్ ఇన్వెన్షన్' అన్నట్టు పిచ్చయ్య చీపురు యంత్రాన్ని తయారు చేశాడు. అంతకుముందు మరికొన్ని ఆవిష్కరణలు చేశాడు. అందుకు నేపథ్యం ఇది:**

"మా అమ్మ సోది చెప్పేది. పది సంవత్సరాలప్పుడు మా అమ్మెంబడి సోదికి పోయిన. మా అమ్మ సోది చెబితే వచ్చే గింజలు మోసుకుని మా అమ్మెంబడి వచ్చేది. పదుహేను సంవత్సరాల దాకా అట్ల మా అమ్మెంబడి సోది బుట్ట మోసుకుంట తిరిగిన. ఆడ్నుంచే నాలుగు పంది పిల్లలుంటె ఆ పంది పిల్లల సూసుకోవటం... మాకు అప్పుడు గాడ్దులు కూడా ఉండె ఆ గాడ్దులు గాయడం... దానిమీదనే ఊరూరు తిరుగి బతికేది."



పాలిష్‌లో నిమగ్నమైన ఎరుకల యువకుడు

"బతుకుతూ ఉంటే షికారు కూడా చేసేది. మరి అడివి షికారి. పిట్టలు షికారు చేసేది. ప్రతి ఒక్కరం ఆ పిట్టల షికారు మీద ముప్పై నలభై ఇట్లా సంపాదించేది. నాలుగు పిట్టలు పట్టుకొచ్చు కోవడం, అవి అమ్ముకొచ్చుకోవడం... ఇరవై ముప్పైరూపాయలు వచ్చేది రోజుకి. ఆ రోజుల్లో ఇట్లనే ఆ పిట్టలు గూడా ఎట్లా పట్టాలా అని నాకు ఆలోచన వచ్చింది."

"అడవి చెర్లు తిరిగేది గద. బాతులు, గోరెంకలు, బురక పిట్టలు పట్టేందుకు చక్కగ వలలు తయారు చేసిన. రోజుకు మూడు నాలుగు పడుతుంటే కొన్ని... యాభై అరవై పడేటట్టుగా తయారు చేసిన. తయారు చేస్తే రోజుకు యాభై అరవై వంద నూటాయాభై ఇట్లా పడేవి."

"ఇగవస్తె ఆ పిట్టలమీద ఒక పదిమందిమి పోవడం, పట్టుకుని దానిమీద ఒక ఏడెనిమిది సంవత్సరాలు దానిమీదే మంచిగనే బతికినం. ఆ తర్వాతనే ఈ మిషను తయారు చేసిన. ఆలోచించి నెలరోజుల్లోనే తయారు చేసిన. ఇంటింటికి చెప్పిన ఇట్ల చేస్కోమన్న. అందరు చేసుకున్నరు. మనిషికొకటి మనిషికొకటి చేసుకున్నరు."

"ఎనకట బతికిన సంతోషానికంటే ఇప్పుడే మంచిగున్నం. పొట్ట లొట్ట బట్ట మొత్తం దీనిమీదే ఎల్లదీస్తున్నం."

"అందరూ యాజ్జేసుకుంటరు. మా వాడు మాకు దీన్ని కనిపెట్టి తయారు చేసిండని అందరూ చెప్పుకుంటరు. ఇంగ..."

**చీపురనే జాడికట్ట అంటారు. ఆ జాడికట్టనే పొరక అని కూడా పిలుస్తారు. వీటిని చిన్న సైజులో ఒక రకం, కాసింత పెద్ద సైజులో మరోరకం - రెండు విధాలు చేస్తారు. ఇవికాకుండా పెద్ద కర్ర ఉండి, చివర్లో చిన్న జాడి ఉండే బూజుకర్రలను కూడా వీరు తయారు చేస్తారు. ఒక్కొక్కటి మూడు నుంచీ పదిరూపాయల దాకా అమ్ముతారు. మహారాష్ట్రలో పెద్ద ఎత్తున వీటి విక్రయాలున్నాయట:**

"దీపావళి, దసరా పండగలకు మహారాష్ట్రకు పోయి పొరకలు అమ్ముతాం. అక్కడ ప్రతి దేవుడికంటే ఇది ముఖ్యం. వీటిని లక్ష్మిజాడిలంటారు. రేపు పండగ అనంగ ఇయ్యాల మనిషికొక్కటి కొనుక్కుని మూలంగ పెట్టి కుంకుమ బొట్టువెట్టి దానికి కొబ్బరికాయకొట్టి మొక్కుతరు. దేవుని కంటే ముందు ఫస్టు ఈ జాడికి మొక్కుతరు. అందుకనే కొన్ని వేల జాడీలు తీసుకెళ్ళినా అక్కడ ఖర్చయితయి. ఎన్ని లారీలు తీసుకువోయినా ఆ దినం దసరా దీపావళి వరకే ఖర్చయిపోతాయి."

"నాకు చదువులేదు సార్. అక్షరం ముక్కుంటే రాసుకుని వీళ్ళతాన వాళ్ళతానకు పోదును. ఆనాడు మా అమ్మనాయిన సదువు నేర్పలేదు. ఇగ నా తెలివంటారా? ఇది మా అమ్మ సదువుతో నేర్పించిందికాదు. ఒక విద్యతో నేర్చుకున్నదిగాదు."

"ఇగ ఈ ఆంధ్రలో... గ్రామగ్రామానా ప్రతి ఊర్లో, దేశంలో అమ్ముకుంటం. ఈడ తక్కువేమీగాదు, ఇక్కడ మనిషికి ఇంటికొకటి కావల్సిందే కద. దీపావళి, దసరాకేమో అక్కడ. తొమ్మిదినెల్లు ఇక్కడ.. రెన్నెళ్ళు మహారాష్ట్రాల. ఒకనెల కర్నూలులో ఈతవనాలు ఉన్నయి. అక్కడికి పోయి బరకను కోసుకొచ్చుకుంటం లారీలల్ల."

**ప్రభుత్వ ఉదాసీనత గురించి ఆయన విచారించినా, తనకు**

దక్కాల్సిన గుర్తింపు గూర్చి పెద్దగా పట్టదు.

"గవర్నమెంటు పట్టించుకుంటే మంచిగనే ఉండు. కానీ మమ్మల్ని ఆడికి ఎవరు తీస్కపోతరు. ఎవ్వలు పట్టించుకుంటరు. ఎవ్వలు రావటంలేదు. మా జాతిల నాకు గుర్తింపు ఉన్నది. ఒక్కటిసార్... ఏది చేసినా మంచిగ చేసిండు అంటరు. చేసిందానికి మా జాతి పొగుడుతున్నరు."

"మా జాతి ముంగటికి పోవాలని ఇంకేమన్న చేయాలని ఉన్నది. ఏదన్న పెద్ద విద్య చేయాలన్న నాలుగు రూపాయలు ఖర్చయితది. అప్పు సప్పు చేయాలె. దీనిమీదనే పొట్ట ఎల్లిపోతున్నది గద మళ్ళ అప్పు సప్పు చేయాలన్న ఆలోచన వస్తలేదు."

"ఒకటి సార్. తాళ్ళ మిషన్లు జేస్త. వాటితోని మోకులు జేస్త. గౌండ్లోళ్ళు ముస్తాది వేసుకుని చెట్లెక్కుతరు. దాన్ని తయారు చేస్త. ఎడ్ల పగ్గాలు, లారీ మోకలు జేస్త. వీటన్నిటి కోసం మనిషికొక మిషన చేసి పెట్టాలని మా ఉన్నది. ఎనిమిది పదివేలు ఖర్చయితయి. అందుకని ఆ ఆలోచన అట్లనే మూలకు పారేసిన"

"జాడీలకు రబ్బరు తాళ్ళు కడతాం. ఆ రబ్బరు చీరేందుకు మిషన తయారు చేయాలని ఉంది. దానికి కూడా ఆలోచనజేసిన. ఆ మిషను మన చేత్తోని తిప్పాలా... మోటరు మీద తిప్పాలా ఆలోచిస్తున్న. చేతుల్తోని కోసే బదులు మోటరు కేస్తే తేడా లేకుండా కాస్తదిగద. దీన్ని ఎట్లా చేయాలా... అని ఆలోచిస్తున్న. కష్టం లేకుండా ఆ మిషను కనిపెట్టేస్తే... ధనా ధన్ ఒక నాలుగు వేల పొరకకు ఉపయోగపడతది గద. ఇట్ల ఉపకారం చేయాలని ఉన్నది. ఇయ్యాల చేద్దామా రేపు చేద్దామా అన్నట్టుగనే నడిచిపోతుందిగాని అయితలేదు."

**పిచ్చయ్యలో చదువు లేదనే విచారం ఉంది. అయితే అంతకన్నా తన విజ్ఞానం మీద, శాస్త్రీయత మీద ఎనలేని విశ్వాసం ఆయన సొంతం.**

"నాకు చదువు లేదు సార్. అక్షరం ముక్కంటే రాసుకుని వీళ్ళ తాన వాళ్ళ తానకు పోదును. ఆనాడు మా అమ్మనాయిన నాకు సదువు నేర్పలేదు. ఇగ నా తెలివంటారా? ఇది మా అమ్మ సదువుతో నేర్పించిందిగాదు. ఒక విద్యతో నేర్చుకున్నదిగాదు. చిన్నప్పుడే పందులు గిందులు కాయవెట్టింది. నేనేమో ఇగ నా తెలివితోనే... ఇది చేద్దామా... అది తయారు చేద్దామా... అని ఎక్కువ ఆలోచిస్త."

"ఎక్కువ ఆలోచన అంటే... ఏది తయారు చేస్తే చప్పున అమ్ముడు పోతది అని ఆలోచిస్త."

"ఒకలు మెకానిక్ నేర్పుతునే నేర్చుకుంటరు. నేనేం చేస్తనంటే ఆడ సైకిల్ ఉండనీ ఏదన్నా ఉండనీ. ఆ సైకిలు ఎదురుంగ నిలబెడితే ఈడ ఆ పనిముట్లన్ని పెట్టుకుని దాన్ని తయారు చేస్త. అంత ఆలోచన ఉంది నాకు."

"అదే ఆలోచనమీద ఏదన్నగానీ చేయగలుత అని ధైర్యం."

**చివరగా, పిచ్చయ్య కుటుంబం గురించి. ఆయన తండ్రి తిరుపతయ్య, తల్లి గోదావరి, భార్యా పిల్లలు?**

"నా తల్లేమో గోదావరమ్మ. భార్యేమో గంగమ్మ. నాకు ముగ్గురు కొడుకులు, ఒక ఆడబిడ్డ. అందరి పెళ్ళిళ్ళు చేసిన. పెళ్ళయినాగాని ఇద్దరు కొడుకులు, కోడళ్ళను చదివిస్తున్న. రెండో కొడుకు, కోడలూ డిగ్రీ సదువుతున్నరు. మూడో కొడుకు కోడలు పది పాసయి ఇంటర్ సదువుతున్నరు. చిన్నోడు సదువుతున్నా నా ఎంబడే ఉంటడు. జాడిలు తయారు చేస్తడు. ఇది సార్ నా పిల్లా జెల్లా. మేం అందరం కరువు లేకుండా చక్కగ బతుకుతున్నం సార్. ఇంకేం జెప్పమంటరు?"

తనదైన నవ్వుతో 'మిషన' మీంచి లేచి అడిగాడు పోల పిచ్చయ్య. ఇంకేమైనా అడగాలనుకుంటే ఆయనకు మొబైల్ ఉంది మరి సెలవు.

చిరునామా:

పోల పిచ్చయ్య,

నాంచారమ్మ నగర్ కాలనీ (ఎరుకల కాలని) ,

మన్సూరాబాద్, ఎల్‌బి నగర్ మున్సిపాలిటి, హైదరాబాద్, భారత్.

మొబైల్: 9963317440

కందుకూరి రమేష్ బాబు

kandukurirameshbabu@yahoo.co.in